# బొండు మల్లెలు

ఊళ్లో పువ్వులకి మంచి ధర ఉన్నాది. ఊరికేవుంది మా వెనక పెరడు. మంచి లాభం వస్తుందని మల్లె పెరడు వెయ్యడానికి నిశ్చయించాను.

మల్లెలమ్మి డబ్బు చెయ్యడంలో కొంత ప్రపంచాన్ని దోపిడీ చెయ్యడముంది. అయినా ఆ దోపిడీ న్యాయంగా కనబడ్డాది. ధనికులే, అనగా ప్రజలని దోపిడీ చేసి ఐశ్వర్యవంతులయిన వాళ్లే నా మల్లెలు కొంటారు. అంచేత నేను దోపిడీ చేస్తున్న వాళ్లని మల్లెలతో దోపిడీ చేస్తాను.

పెరట్లో గోతులు తవ్వడానికి ఒక కూలివాడి అవసరం పడ్డాది. నాలుగు రోడ్ల మధ్య కెళితే పొట్టవెన్నుకంటుకుపోయిన ముసలివాడు యెదురుగా వచ్చాడు.

"పనుందా బాబూ?" అనడిగేడు.

"నువ్వు చెయ్యిలేవు" అన్నాను. రెండేసి మూళ్లు లోతుని గోతులు గునపంతో తవ్వాలి. మన్నూ మశానం వాటిలో కెత్తి బొండుమల్లె కుదపలు పాతాలి.

"ఏం పని బాబూ?" అన్నాడు.

"గునపంతో తవ్వాలి."

"తవ్వేస్తాను బాబూ" అన్నాడు. తాత తరమా? ముష్కరమైన వాడైతే అయిదు రోజులు చేస్తాడు. తాత పదిరోజులకైనా చెయ్యిలేడు. అతణ్ణి తీసికెళ్లడం శుద్ధ దండుగ.

"పోనిస్తూ" అన్నాను.

"పని యేటో సూడనీయండి. మొత్తాన్ని సేసుకుంటాను. తమకి తోసింది ఇయ్యండి" అన్నాడు. అతని జాలికరమైన మొహంలోకి చూడగానే, యిష్టం లేకపోయినా కాదనలేక పోయాను.

"సరే" అన్నాను. వెంటపడ్డాడు. పని చూసుకొన్నాడు. పాపం చాలా తక్కువే అడిగాడు. బలమైనవాడికి ఐదురోజుల పని. అంతకు ఎక్కువే ఇవ్వొచ్చు.

బాగా తగ్గించి అడిగాను.

"కష్టం చూడండి బాబయ్యా" అన్నాడు.

"నాతో ఇన్ని బేరాలు లేవు".

"సరే తమసిత్తం. మద్దేన్నంవేలా తమరు ఇడిచిపెట్టేది, ఇంత గెంజి పొయ్యండి" అని ప్రాధేయపడ్డాడు.

"పోస్తానులే" అన్నాది నా పెళ్లాం. చవకగా కుదిరేదని గ్రహించింది కాబట్టే ఆ అభిమానం! ఇంట్లో రోజూ సేరు గంజి వారుతుంది. వీధి కాలువలోకి వొదిలిపెడుతున్నదే. తాతకి పోసినందువల్ల నష్టం లేదు. సారవంతమైన గంజిని కాలువపాలు చేసి పిప్పిని "అన్నం" అనుకొని నాగరికులం తింటాం.

తాత పదకొండు రోజులకిగాని పని పూర్తి చెయ్యలేకపోయాడు. తాతకి నోరూ వావీలేదు. ఎలాగచెపితే అలాగ తవ్వేడు. అనుకొన్న ప్రకారం డబ్బు యిచ్చేను. ఎక్కువ అడుగుతాడను కున్నాను. గునుస్తాడనుకున్నాను. అల్లరి చేస్తాడనుకున్నాను. ఏమీ లేదు. నోరు కదపకుండా పట్టుకుపోయాడు. కాని మర్నాడే "పని సెప్పరా?" అంటూ వొచ్చాడు.

"మొక్కలకు నీళ్లు పోస్తావా?" అనడిగాను.

"పోస్తాను" అన్నాడు. నూతులో నీళ్లు తోడాలి. మోసుకెళ్లిపోయాలి.

"నెలకేమివ్వమన్నావు?"

"తమ సిత్తం."

నెల కింత అని చెప్పేను.

"సిత్తం" అని ఇంకేదో చెప్పబోయాడు.

"ఏంటి తాతా?"

"... ఏటడుగుతాను?.... తమ రొగ్గేసినది" అని నసికినసికి, "గెంజి నీళ్లు" అన్నాడు.

తాత కుదురుకున్నాడు. మాకు తేరగా దొరికేడు. తాతకి నోరూ వావీ లేదు. ఏం చెప్పినా చేసేవాడు. చీకటితోటొచ్చేవాడు. చీకటి పడుతుంటే వెళ్లేవాడు. పగలల్లా ఏదో పని చేస్తూనే వుండేవాడు. మధ్యాహ్నం గంజి పోసేవాళ్లం.

తాత గంజిలోకి పిల్లలు దిగవిడిచిన అన్నం కెరళ్లూ కూడా వెళ్లేవి. తాతనంజు కోడానికి విస్తళ్లలో దిగబెట్టిన కూరలు, పాచిపట్టిన పచ్చళ్లు వెళ్లేవి.

నెల జీతం అందుకొన్న మరునాడు తాత మొహం పరమానందంగా ఉంది.

"నా దినం తీరుతాది బాబూ" అని నాతో చెప్పేడు.

"ఏంటి విశేషం తాతా?"

"తమరిచ్చిన జీతం సేతిలెట్టాను. రేత్రి నా కూతురు పట్టిడన్నం పెట్టింది."

"రోజూ పెట్టడం లేదూ?"

"నేదు బాబూ, తమ పాదాలసాచ్చి. తమరింట్లో గెంజి మెతుకులు తప్ప కడుపు కింకేటి నేదు."

నా వొళ్లు కంపించింది.

"తాతా! నీ కూతురు దగ్గరా ఉన్నావు?"

"సిత్తం".

"కొడుకుల్లేరూ?"

"కొడుకుండేవాడు, సచ్చిపోనాడు. నా నద్దానమైపోనాను. కోడలు ఏరే కాపురం చూసుకుంది."

"కూతురు తిండి పెట్టింది కాదేం?"

"కూడెట్టిందికాదు, డబ్బు సెడ్డపాపిస్టి. తల్లీ పిల్లల ఆశలు సంపుతాది. రేత్రి జీతమంతా సేతిలెట్టినాను. పట్టెడన్నం పెట్టింది. ఇంక దినం తీరుతాది" అన్నాడు.

ఆ రోజు నుంచి తాత మా యింట్లో మనిషి అయిపోయాడు. తాత మీద ఇంటిల్లిపాదికి జాలి కలిగింది. ఇంత అన్నం కూడా వేసి ఆదరిస్తున్నారు.

మల్లెలు మొగ్గలు తొడిగేయి. మొగ్గలు అమ్మడం ఆరంభించేము. మధ్యాహ్నం బుట్టలో పట్టుకెళ్లి తాతే అమ్ముకొచ్చేవాడు. సోలడు మొగ్గలు యింతా అని. బుట్టెడు మొగ్గలయేవి.

మల్లెలు రెండు విడతలు పూశాయి. తోటవల్ల మూడు వందల రూపాయలు లాభం వచ్చింది. దాగరంత దొడ్డికి తాత జీతం పోను ఆ లాభం వచ్చింది. నేను చవగ్గా మొగ్గల మ్మేశాను. బొండు మల్లెలు సోల అణా ఏం? బేడన్నా కొందురు. అణాన్నరైనా చేయవలసింది. తెలిసింది కాదు.

వృద్ధి అయిన తరువాత మల్లెతోట ఎంతో సరదా వేసింది. నా మల్లెలు ఎంతో మంది యువతులు ధరించేరు, ఆనందించేరు. నేను రసజీవిని. అంచేత యువతుల వాల్జడలో బొండు మల్లెలు వికసించటం నా కెంతో మక్కువ.

తొలకరికి మరి తాత పనిలోకి రాలేదు. తాత భోగట్టా చెప్పేవారెవరూ లేకపోయారు. అన్నాళ్లు పని చేసేడు కాని, అతని ఇల్లెక్కడో మేము కనుక్కోలేదు. తాత తాత అండమే తప్ప మాయింట్లో యెవరికీ అతని పేరు తెలియదు. అంతచిత్రంగా ఉంటాయి మన సంబంధ బాంధవ్యాలు.

చాలాకాలమైన తరువాత, వంకాయలమ్మే మనిషి "మీ దొడ్లో మల్లె మొక్కలు బాగున్నాయా?" అని అడిగింది. మల్లె మొక్కలున్నట్లు నీకెలాగ తెలుసనడిగేను.

"మీ దొడ్లో తాత పని చేసేవోడుకాదా?"

"తాత నెరుగుదువా?"

"ఆళ్ళది మాయీదే".

"తాత బాగున్నాడా?"

"సచ్చిపోనాడు. మీకు తెల్దా?"

"చచ్చిపోయాడా! ఎప్పుడు?"

"అబ్బో శాన్నాళ్లయింది. ఇంకా బతుకును బాబూ! జబ్బు చేసి నిమ్మళించింది. తరవాత కూతురు నూసిందికాదు. డాక్టేరుగారు పళ్లూ జావలు ఎట్టమన్నారు. నాకాదెక్కడదని వొగ్గేసింది. సచ్చిపోనాడు. ఆ కూతురు సెడ్డ ఘటుకురాలు" అన్నాది.

కూతురిని అనవలసిన పనిలేదు. దానికోటి వుందో లేదో?

ఎంత తండ్రి అయినా పెట్టడాని కుండాలా? లేమి ఎంతటి వాళ్లలోనైనా మాన వత్వాన్ని చంపి అమానుషత్వాన్ని పెంచుతుంది. వృద్ధులకి పెన్షనులైనా ప్రభుత్వం ఇస్తే బావుణ్ణు. జీవితభీమా ఉన్నా బావుణ్ణు.

తాత వృత్తాంతం ఆలోచించినకొద్దీ నేను ద్రోహం చేసినట్టు బాధపడ్డాను. బొండు మల్లెలు వేసింది, పెంచింది, డబ్బుచేసింది తాతే! వచ్చిన ఫలితం నేను చల్లగా జేబులో వేసుకొన్నాను. ఆ డబ్బంతా తాత ఆర్జనకాదూ? ఆ డబ్బే తాతదైతే ఎంత సుఖపడును! అవసానకాలంలో జరక్కపోనా? దోపిడి చేస్తున్న వాళ్లకి బొండుమల్లెలమ్మి దోపిడీ చేస్తున్నాననుకొన్నాను కాని, తాతని పెద్ద దోపిడీ నేనే చేసేను. నెలకి నాలుగు రాళ్లు జీతం ఇచ్చి రోజుకిన్ని గంజినీళ్లు పోసి సాగనంపాను. దొడ్డి నాది. ఫలితం కష్టపడ్డ వాడికి కాకుండా పోయింది.

❊

ప్రజాశక్తి, 15-9-1943